క్లుప్తంగా

పాడి రైతుల అభివృద్ధే ధ్యేయం

రాయికల్: పాడి రైతుల సంక్షేమమే కరీంనగర్ డైరి ధ్యేయమని చైర్మన్ చల్మెడ రాజేశ్వర్‌రావు అన్నారు. మండలంలోని రామాజీపేట గ్రామానికి చెందిన పాడిరైతు బేతి ఆనందరెడ్డి–భాగ్య కూతురు వివా హానికి కరీంనగర్ డైరీ చైర్మన్ రాజేశ్వర్ పుస్తెమెట్టెలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతుల సంక్షేమం కోసం కరీంనగర్ డైరీ ఆధ్వర్యంలో బోనస్ అందజేస్తున్నామని, పాడి రైతులు మృతిచెందితే కుటుంబాన్ని ఆదుకోవడం కోసం ఇన్సూరెన్స్‌తో ఆదుకుంటున్నామని గుర్తు చేశారు.పాడి రైతుల పిల్లల చదువుల కోసం స్కాలర్‌షిప్ అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు అంబల్ల రాజరెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ లక్ష్మీపతి, ఇన్‌చార్జి రాధాకృష్ణ, సూపర్‌వైజర్ రాజేష్, కార్యదర్శి సుధాకర్, రాంరెడ్డి, లక్ష్మారెడ్డి, మల్లారెడ్డి పాల్గొన్నారు.

చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం



బాసర క్షేత్రంలో విద్యార్థులు, తల్లిదండ్రులు

కథలాపూర్: మండలంలోని సిరికొండ జ్యోతివాణి పాఠశాల విద్యార్థులకు ఆదివారం బాసరలోని సరస్వతీదేవి ఆలయంలో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. విద్యార్థులకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అంటే గౌరవం పెంపొందించాలని, వారి సమక్షంలో అక్షరాభ్యాసం చేయించామని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సిరిమల్ల రాజేశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అల్పాహారం పంపిణీ



అల్పాహారం పంపిణీ చేస్తున్న సభ్యులు

మెట్‌పల్లి: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అల్పాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆదివారం రోగులకు, ఆస్పత్రి సిబ్బందికి అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ లయన్స్ పీడీజీ ఎస్వీ తపాడియా పుట్టినరోజు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు అంజనేయులు–అనురాధ పెళ్లిరోజును పురస్కరించుకుని కార్యక్రమం చేపట్టినట్లు క్లబ్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

కటుకం గణేశ్‌కు సేవా పురస్కారం



సేవా పురస్కారం అందిస్తున్న నాయకులు

కోరుట్ల: పట్టణానికి చెందిన కటుకం గణేశ్‌కు జిర్స్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో జిర్స్ సేవా పురస్కారాన్ని ఆదివారం అందించారు. బీమారం మండలం వెంకట్రావుపేటలో ఆ సంస్థ 17 వ వార్షికోత్సవం సందర్భంగా బీఆర్‌ఎస్ వేములవాడ నియోజక వర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీకాంతారావు 2024 అవార్డును అందజేశారు. కటుకం గణేశ్ గత 17 ఏళ్లుగా రక్తం అవసరం ఉన్న రోగులకు 4250 మంది రక్త దాతలను సమకూర్చినందుకు గుర్తింపుగా ఈ అవార్డును అందించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ హరి చరణ్ రావు, బీఆర్‌ఎస్ నాయకులు అంగడి ఆనంద్, శ్రీపాల్ రెడ్డి, శ్రీనివాస్ రావు, తదితరులు పాల్గొన్నారు.

మూలనపడ్డ చెత్త సేకరణ వాహనం



వెల్లులలో చెత్త సేకరణ వాహనం

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం వెల్లుల గ్రామ పంచాయతీలో బ్యాటరీ చెత్త సేకరణ వాహనం మూలనపడింది. గతంలో గ్రామంలోని వీధుల గుండా చెత్త సేకరించేందుకు బ్యాటరీ వాహనాన్ని కొనుగోలు చేసిన అధికారులు, కొన్నిరోజుల తర్వాత అది చెడిపోవడంతో పక్కన పెట్టేశారు. ప్రజాధనంతో కొనుగోలు చేసిన వాహనానికి మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకురావాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు.

ఆహ్లాదం.. అందనంత దూరం

- అధ్వానంగా పల్లెప్రకృతి వనాలు
- చాలాచోట్ల నామమాత్రమే
- పలు గ్రామాల్లో ఎండిన మొక్కలు
- నిర్వహణ లోపమే కారణం



ఆట పరికరాల మధ్య పెరిగిన పిచ్చిమొక్కలు



మెట్లచిట్టాపూర్ పల్లెప్రకృతివనంలో ఎండిపోయిన మొక్కలు

మెట్‌పల్లిరూరల్: గ్రామీణ ప్రాంత ప్రజలకు ఆహ్లాదం అందించేందుకు ఏర్పాటు చేసిన పల్లెప్రకృతి వనాలు నిరుపయోగంగా మారాయి. గత ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రకృతివనాలను ఏర్పాటు చేసినప్పటికీ వాటి నిర్వహణను గ్రామ పంచాయతీలు పట్టించుకోకపోవడంతో అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. లక్షల ప్రజాధనం వెచ్చించి ఏర్పాటు చేసిన అధికారులు వాటి నిర్వహణ విషయంలో నిర్లక్ష్యం వహించడంతో విమర్శలు వ్యక్తమౌతున్నాయి. మరోవైపు ప్రకృతివనాలు మందుబాబులకు అడ్డాగా మారాయి.

కొన్నిచోట్ల మాత్రమే ఆహ్లాదం..

గ్రామాల్లో ఏర్పాటు చేసిన పల్లెప్రకృతి వనాలు కొన్నిచోట్ల ఆహ్లాదం పంచుతుండగా, చాలా చోట్ల నామమాత్రంగానే ఉండిపోయాయి. మెట్‌పల్లి మండలంలో మొత్తం 23 పల్లె ప్రకృతివనాలు,4 బృహత్ పల్లెప్రకృతి వనాలు ఏర్పాటు చేశారు. ఇందులో నీడనిచ్చే అటవీజాతి మొక్కలు,పూల మొక్కలను నాటారు. కూర్చునేందుకు వీలుగా బెంచీలను ఏర్పాటు చేశారు.అలాగే బృహత్ పల్లెప్రకృతి వనాల్లో చిన్నపిల్లలు ఆటలు ఆడేందుకు వీలుగా ఆట పరికరాలు ఏర్పాటు చేశారు. కానీ వీటి నిర్వహణను పట్టించుకోకపోవడం,గ్రామాలకు దూరంగా ఏర్పాటు చేయడంతో ప్రజలు ఆసక్తి చూపడంలేదని తెలిసింది. ప్రకృతివనాలను ఏర్పాటు చేయించిన మొదటి రెండేళ్లు ఉపాధిహామీ అధికారుల ఆధీనంలో నిర్వహణ ఉండేది.ఆ తర్వాత నుంచి పంచాయితీలకు అప్పగించారు.

అసాంఘిక కార్యకలపాలకు అడ్డాగా..

మెట్‌పల్లి మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొన్ని పల్లె ప్రకృతివనాల్లో వాడిన మొక్కలు,ఎండిన చెట్లే దర్శనమిస్తున్నాయి, గడ్డి పెరిగిపోయి దారుణంగా తయారయ్యాయి. ఎండిన ఆకులతో నిండిపోయి అపరిశుభ్రంగా మారాయి.అంతేకాకుండా బెంచీలు దుమ్ము,ధూళితో నిండుకున్నాయి.వీటిని కన్నెత్తి చూసే వారు లేకపోవడంతో అసాంఘిక కార్యకలపాలకు నెలవుగా మారాయి. మందుబాబులు అడ్డాగా మార్చుకుని అక్కడే మద్యం సేవిస్తున్నారు.కాగా ప్రకృతివనాలకు ఎంతో ప్రజాధనాన్ని వెచ్చించినప్పటికీ ప్రజలకు ఏ మాత్రం ఉపయోగపడడంలేదన్నా అభిప్రాయాలు వ్యక్తమౌతున్నాయి.

ట్యాంకర్లతో నీరు సరఫరా చేస్తున్నాం

పల్లెప్రకృతి వనాలు బాగానే ఉన్నాయి. ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం.పెరిగిన చెట్లు, మొక్కలు ఎండిపోకుండా జీపీ ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయిస్తున్నాం.అయినప్పటికీ సిబ్బందికి మరోసారి సూచనలు చేస్తాం.ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని చెబుతాం.వాటి నిర్వహణ ముందుగా ఉపాధిహామీ ఆధీనంలో ఉండేది. ప్రస్తుతం పంచాయతీలదే బాధ్యత.

– తిరుపతి,ఏపీవో, మెట్‌పల్లి

ఘనంగా భీమన్న జాతర ఉత్సవాలు



చిట్టాపూర్‌లో భీమన్న ఆలయానికి బోనాలతో తరలివెళ్తున్న ఆదివాసీ నాయకపోడు మహిళలు

మల్లాపూర్: ఆదివాసీ సంస్కృతీ సాంప్రదాయాలను కాపాడుకోవాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సంస్కృతిక సారథి కొమ్ము రవికుమార్ అన్నారు. మండలంలోని చిట్టాపూర్‌లో ఆదివారం ఆదివాసీ నాయకపోడు సేవా సంఘం ఆధ్వర్యంలో భీమన్న జాతర ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సంజీవ్‌తో కలిసి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ వేడుకల్లో గ్రామస్తులు పెద్దసంఖ్యలో పాల్గొని ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా భీమన్న ఆలయానికి తరలివచ్చి స్వామి వారికి సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీ నాయకపోడుల చరిత్ర చాలా పురాతనమైనదన్నారు. నాయకపోడులు భీమన్న జాతర ఉత్సవాలను ఐదు రోజుల పాటు జరుపుకుంటున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మైస లక్ష్మీ, ఫ్యాక్స్ చైర్మన్ నేరేళ్ల మోహన్‌రెడ్డి, తాజామాజీ సర్పంచ్ కడకుంట్ల సాయికుమార్ ఆదివాసి నాయకపోడు సేవాసంఘం అధ్యక్షుడు రమేకశ్, రాములు, సంఘం సభ్యులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

పౌర మానవ హక్కుల సంస్థ జిల్లా సంయుక్త కార్యదర్శిగా తాలుకా మల్లేశ్



నియామకపు పత్రాన్ని అందిస్తున్న నాయకులు

కథలాపూర్: పౌర, మానవ హక్కుల సంస్థ(కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్) జిల్లా సంయుక్త కార్యదర్శిగా కథలాపూర్ మండల కేంద్రానికి చెందిన తాలుకా మల్లేశ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ సంస్థ రాష్ట్ర కార్యదర్శి భూక్యచరణ్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వాలు ఖర్చు చేసిన ప్రతీ పైసా తెలుసుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. అవినీతి రహిత సమాజం కోసం కృషి చేయాలని, అందుకు ప్రజలు సహకరించాలని మల్లేశ్ కోరారు.

పేదింటి యువతి పెళ్లికి పుస్తెమెట్టెలు అందజేత



పుస్తెమెట్టెలు అందిస్తున్న ఆనందం

కోరుట్ల రూరల్: మండలంలోని పైడిమడుగు గ్రామానికి చెందిన మంగలూరి పెద్దులు– రాధా దంపతుల కూతురు లావణ్య వివాహానికి వల్లంపెల్లికి చెందిన ఆర్‌ఎంపీ వైద్యుడు మాదిశెట్టి ప్రభాకర్ ఆదివారం పుస్తెమెట్టెలు అందించాడు. మాదిశెట్టి ప్రభాకర్ ఇప్పటివరకు 69 మంది నిరుపేద యువతుల పెళ్లికి పుస్తెమెట్టెలు అందజేశాడు.

పెగడపల్లి:మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన ఓ యువతి వివాహానికి పుస్తెమెట్టెలతో పాటు నూతన వస్త్రాలను అందజేసి తన ఉదారతను చాటుకున్నారు మండలంలోని నామాపూర్ మాజీ ఎంపీటీసీ కొమురవెల్లి ఆనందం–ప్రసూన దంపతులు. లింగాపూర్ గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబం రాధ నాగయ్య–శకుంతల కూతురు జీవిత వివాహం ఆదివారం జరుగగా, వివాహ వేడుకలో వీటిని అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రామచంద్రం, ఎంపీటీసీ శోభ, నాయకులు తిరుపతి, మోహన్, మల్లన్న, రమేశ్, సత్తన్న, రాయనర్సు, విజయ్, స్వామిదాసు పాల్గొన్నారు.

పద్మశాలీ సేవా సంఘం అధ్యక్షుడిగా గంగాధర్



గంగాధర్

జగిత్యాలరూరల్: మండలంలోని జాబితాపూర్‌లో ఆదివారం గ్రామ పద్మశాలీ సేవా సంఘం కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ శాఖ అధ్యక్షుడిగా జోగా గంగాధర్ ఉపాధ్యక్షుడిగా అనుమల్ల నగేశ్ కోశాధికారిగా చిప్ప గంగాధర్, ప్రధాన కార్యదర్శిగా అంకం రోషన్‌ను ఎన్నుకున్నారు.

కొనసాగుతున్న విజ్ఞప్తి దీక్ష

ధర్మపురి: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపెల్లి స్థానం నుండి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేయడానికి అవకాశం కల్పించాలని బుగ్గారం మండలంలోని మద్దునూర్ గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు రాయిల్ల రవికుమార్ చేపట్టిన విజ్ఞప్తి దీక్ష ఆదివారం 13వ, రోజుకు చేరింది. ఈ దీక్షకు పలువురు మద్దతు తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

జగిత్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని శ్రీసరస్వతి శిశు మందిర్ 1997–98 విద్యా సంవత్సరం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జిల్లా కేంద్రంలోని సంగీత్ బంకెట్ హాలులో నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు పాఠశాలతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకుని ఉల్లాసంగా గడిపారు. 26ఏళ్ల క్రితం పాఠశాలలో తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయుల బృందాన్ని ఘనంగా సత్కరించారు. పూర్వ విద్యార్థి లక్ష్మీకాంత్ మిమిక్రీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం పడాల విశ్వప్రసాద్, ఎస్ లక్ష్మీ, ఎం.త్రిపుర, ఆర్ శోభారాణి, ఏ నరేందర్, ఆత్మచరణ్‌రావు, నర్సయ్య, పి కృష్ణప్రసాద్, మోతె ఉమాకాంత్, రాజేందర్‌శర్మ, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

కళాశాలలో ఘనంగా వార్షికోత్సవం



వేడుకలను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్

ధర్మపురి : ధర్మపురిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఆదివారం రాత్రి మహాత్మ జ్యోతిబాపూలే వార్షికోత్సవంను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రాధాకృష్ణ, ఆర్సీఎం గౌతమ్‌రెడ్డి, అధ్యాపకులు తదితరులున్నారు.

దుకాణాల ఏర్పాటుకు నేడు వేలం

పెగడపల్లి: మండల కేంద్రంలోని స్వయంభూ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాల సందర్భంగా దకాణాల ఏర్పాటు కోసం ఈ నెల 19 సోమవారం ఆలయం ఆవరణలో వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి గంగారెడ్డి, పోచయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. టెంకాయ, లడ్డు, పులిహోర విక్రయాల కోసం వేలం పాటలు నిర్వహిస్తామని ఉదయం 10 గంటలకు వేలం పాట జరుగుతుందని ఆసక్తి గల ఔత్సాహికులు పాల్గొనాలని కోరారు.

నేడు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

కోరుట్ల రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ లబ్ధిదారులకు అందజేస్తారని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో లబ్ధిదారులకు ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తారని పేర్కొన్నారు.

నేడు శివపార్వతుల కల్యాణం

రాయికల్: మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో సోమవారం గంగసహిత పార్వతి పరమేశ్వరుల కల్యాణం నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు తోపారపు రవీందర్,కౌన్సిలర్ కల్లెడ సునీత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

అనారోగ్యంతో సీఐ మృతి

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ సీఐగా 2018 నుంచి 2021 వరకు పనిచేసిన సీఐ రాజేశ్ ఆదివారం అనారోగ్యంతో హైదరాబాద్‌లో మృతిచెందారు. రూరల్ సీఐగా పనిచేసిన రాజేశ్ బదిలీపై వెళ్లాడు. గత కొద్ది కాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతుండగా, కుంటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. జగిత్యాల రూరల్ మండలంలోని రెండు హత్యకేసుల్లో హత్యల్లో హంతకులను చాకచక్యంగా పట్టుకోని నిందితులకు జైలు శిక్ష పడేలా చేశారు. పలు కేసుల్లో ఉన్నతాధికారులు ఆయనను అభినందించారు. వరంగల్‌లో అంత్యక్రియలు నిర్వహించారు.

ఘనంగా మల్లికార్జునస్వామి బోనాల జాతర

కథలాపూర్: మండలంలోని దూలూర్‌లో ఆదివారం మల్లికార్జునస్వామి బోనాల జాతర ఘనంగా నిర్వహించారు. భక్తులు బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. స్వామివారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. జాతర ఉత్సవాల్లో వస్తువులు కొనుగోలు చేసేందుకు ప్రజలు బారులు తీరారు.

మేడిపల్లి మండలంలో ప్రభుత్వ విప్ పర్యటన



చెక్కులు అందిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

మేడిపల్లి: మండలంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించారు. తొంబరావుపేటలో రూ. 5 లక్షల విలువగల సీసీ రోడ్లు ప్రారంభించి ఎంపీడీవో కార్యాలయంలో 84 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. మండల ప్రజల సమస్యలనవు తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రమేశ్ రెడ్డి, నరేశ్ రెడ్డి, బద్దం రాజేందర్ రెడ్డి, చేపూరి నాగరాజు, జలందర్ రెడ్డి, పుప్పాల కొమురయ్య, తోకల నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

దుర్గంధభరితంగా ఎంపీడీవో కార్యాలయం



ఎంపీడీవో ఆఫీస్‌లో మురుగునీటి వరద

మేడిపల్లి: వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పర్యటనలో అధికారులు అలసత్వం ప్రదర్శించారు. ఆదివారం మండలంలో ఆదిశ్రీనివాస్ పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఎంపీడీవో కార్యాలయంలోని మీటింగ్‌హాల్‌లో చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు కార్యాలయంలోని బాత్‌రూం నుండి వచ్చే దుర్గందంతో ముక్కులు మూసుకున్నారు. కనీసం మరుగుదొడ్లు శుభ్రపరిచే వారు లేకపోవడంతో లబ్ధిదారులు చాలా సేపటివరకూ ఇబ్బందులు పడ్డారు. కార్యాలయంలోనే పారిశుధ్యం పాటించని అధికారులు గ్రామాల్లోకి వచ్చి పారిశుధ్యం పై లెక్చర్ ఇస్తారని జోకులు వేసుకున్నారు. ఎంపీడీవో గది ముందున్న హాల్‌లోకి వరదల వచ్చి దుర్గందం వెద జల్లుతుంది. ఎక్కడ చూసినా దుమ్ముదూళితో నిండిపోయింది. విరిగిన కిటికీలు, గ్లాసు అద్దాలతో అధ్వానంగా మారింది. ఇప్పటికైనా కార్యాలయంలో పరిసరాలు శుభ్రంగా ఉంచాలని ప్రజలు కోరారు.

గత ప్రభుత్వాల హయాంలో కార్మికులకు అన్యాయం



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి మల్లేశం

సారంగాపూర్: గత ప్రభుత్వ హయాంలో మేము మోసపోయామని గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జగిత్యాల జిల్లా కార్యదర్శి పులి మల్లేశం పేర్కొన్నారు. సారంగాపూర్ మండల కేంద్రంలో గ్రామపంచాయతీ సిబ్బంది, ఉద్యోగులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలపై పలు హామీలు ఇచ్చి, వాటిని అమలు చేయడంలో విఫలమైందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి రావడంతో మంత్రి సీతక్క సమస్యల పరిష్కారం కోసం హామీ ఇచ్చిందని, దీనిపై మాకు ప్రభుత్వంపై మాకు నమ్మకం కుదిరిందన్నారు. నెలవారి వేతనాలు చాల వరకు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని గ్రామపంచాయతీలు వెంటనే విడుదల చేయాలని కోరారు. సమావేశంలో సంఘ నాయకులు గజ్జెల గంగలచ్చన్న, నిర్మల, గంగమ్మ, ఉసికె లచ్చయ్య, రాజన్న, లచ్చం, లక్ష్మి, పోసవ్వ, సి.లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీ వేంకటేశ్వర ఆలయంలో జిల్లా అదనపు జడ్జి పూజలు



అదనపు జడ్జిని సన్మానిస్తున్న ఆలయ అర్చకులు

కోరుట్ల: పట్టణంలోని అతి పురాతన శ్రీ వేంకటేశ్వర ఆలయంలో జగిత్యాల జిల్లా అదనపు సెషన్స్ జడ్జి నారాయణ దంపతులు ఆదివారం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, అధికారులు అదనపు జడ్జిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు బీర్నంది లక్ష్మీ నర్సింహ, ఈవో, తదితరులు పాల్గొన్నారు.

ఆకుపై శివాజీ మహరాజ్ చిత్రం



శివాజీ చిత్రంతో చోలేశ్వర్ చారి

గొల్లపల్లి : మండలంలోని రాఘవపట్నం గ్రామానికి చెందిన కవి, సూక్ష్మ కళాకారుడు, లీఫ్ ఆర్టిస్ట్ గాలిపెల్లి చోలేశ్వర్ చారి శివాజీ మహరాజ్ చిత్రాన్ని ఆకు మీద చిత్రీకరించి తన కళాప్రతిభ చాటుకున్నాడు. శివాజీ మహరాజ్ ఎందరికో ఆదర్శవంతమైన వ్యక్తి అని, ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని వారి మార్గంలో యువత నడవాలని సూచించారు. శివాజీ మహరాజ్ చిత్రించడం పట్ల శివాజీ యూత్ సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తూ కళాకారునికి శుభాకాంక్షలు తెలిపారు.

క్లబ్ ఉత్సవానికి చిల్వకోడూర్ విద్యార్థులు



క్లబ్ ఉత్సవాలకు వెళ్తున్న విద్యార్థులు

గొల్లపల్లి : ఢిల్లీలో ఈ నెల 19 నుంచి జరిగే జాతీయ స్థాయి క్లబ్ ఉత్సవాలకు గొల్లపల్లి మండలం చిలవ్కోడూర్ విద్యార్థులు ఢిల్లీకి తరలివెళ్లారు. క్లబ్ గ్రీటింగ్, జంగిల్ ప్లే, బాలుర నృత్యం, ఉత్సవ్ మేళా తదితర అంశాల్లో వీరికి శిక్షణ ఇచ్చినట్లు క్లబ్ మాస్టర్ వినోద్‌గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్

వెల్గటూర్: మండలంలోని స్తంభంపల్లిలో ప్రతీ సంవత్సరం జరిగే శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను ఆదివారం తెలంగాణ ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆవిష్కరించారు. ఈ నెల 21 నుంచి 26 వరకు జరిగే బ్రహ్మోత్సవాల్లో భాగంగా 21న స్వామివారి కల్యాణం, 25న రథోత్సవం, 26న ఎడ్లబండ్ల పోటీలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ పాకాల నరేశ్ తెలిపారు. కార్యక్రమంలో పాదం దుబ్బస్వామి, మార్గం సతీశ్, హరి ప్రశాంత్, సప్ప తిరుపతి, యాగండ్ల గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విప్‌ను కలిసిన సీఐ, ఎస్సైలు

ధర్మపురి: వివిధ మండలాల్లో నూతనంగా పదవీ బాధ్యతలు తీసుకున్న సీఐ, ఎస్సైలు ఆదివారం ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. వారిలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాంనర్సింహరెడ్డితో పాటు వివిధ మండలాల ఎస్సైలు పాల్గొన్నారు.